క్లుప్తంగా

క్రీడల్లో విస్టం విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల మెంటార్ జేమ్స్‌స్టీఫెన్ తదితరులు

సింహాచలం : నరవలోని విశాఖ ఇంజనీరింగ్ కళాశాలలో ఇటీవల జరిగిన మెక్ ఉత్సవ్ 2023 క్రీడా పోటీల్లో విస్టం ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రదర్శన కనబరిచారు. కబడ్డీలో విజేతలుగాను, వాలిబాల్‌లో రన్నర్స్‌గా నిలిచారు. ఈసందర్భంగా విద్యార్థులను కళాశాల మెంటార్ జేమ్స్ స్టీఫెన్, వైస్ ప్రిన్సిపాల్ జాషువా, ఫిజికల్ డైరెక్టర్ బి.రమణారావు అభినందించారు.

వేడుకగా అప్పన్న నిత్య కల్యాణం



యజ్ఞోపవీత ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో ఉదయం 9.30 గంటల నుంచి 10.30 గంటల వరకు ఈ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణ ధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాల ఘట్టాలతో కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు. అర్చకులు శ్రీకాంత్ తదితరులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

అమ్మవార్లకు విశేషంగా తిరువీధి



అమ్మవార్లకు హారతి ఇస్తున్న అర్చకుడు

సింహాచలం: సింహగిరిపై సింహవల్లీ తాయారు అమ్మవారికి, సువర్ణ అమ్మవారికి శుక్రవారం విశేషంగా తిరువీధి జరిగింది. అమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకిలో వేంజేపచేసి సాయంత్రం ఆలయ బేడామండపంలో తిరువీధి నిర్వహించారు. విశేషంగా హారతులు అందజేశారు. ఆలయ సూపరింటెండెంట్ నాయుడు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఆర్టీసీ బస్ ఢీకొని సెక్యూరిటీ గార్డు మృతి

అల్లిపురం: ఆర్టీసీ బస్ ఢీకొని సెక్యూరిటీ గార్డు మృతి చెందిన ఘటన టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వన్‌టౌన్ కొత్తరోడ్డు ప్రాంతానికి చెందిన అండిబోయిన కోటేశ్వరరావు (60) సిరిపురం జంక్షన్‌లో గల ఖరాచీవాలాలో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నాడు. శుక్రవారం ఉదయం 9 గంటల సమయంలో స్కూటీపై విధులకు బయలుదేరాడు. పూర్ణామార్కెట్ నుంచి సీపీ కార్యాలయం జంక్షన్ వైపు వస్తుండగా, 28వ నంబర్ ఆర్టీసీ బస్సు అతనిని బలంగా ఢీకొట్టడంతో ఆయనకు బలమైన గాయాలయ్యాయి. దీంతో ట్రాఫిక్ కానిస్టేబుల్‌తో కలిసి ఆర్టీసీ బస్ సిబ్బంది గాయపడిన కోటేశ్వరరావును కేజీహెచ్‌లో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ అతను మరణించాడు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

చురుగ్గా బీఆర్‌టీఎస్ రోడ్డు ఆధునికీకరణ పనులు

ఆరిలోవ: బీఆర్‌టీఎస్ రోడ్డు ఆధునికీకరణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. నగరంలో జరగనున్న జీ-20 సదస్సు దృష్ట్యా హనుమంతవాక నుంచి అడవివరం వరకు ఉన్న బీఆర్‌టీఎస్ రోడ్డును అధికారులు సుందరీకరణ చేస్తున్నారు. ఇందులో భాగంగా పెయింటింగ్‌తో పాటు రోడ్లు కూడా వేస్తున్నారు. ఈ రోడ్డు మధ్య మధ్యలో పెద్ద గోతులు పడింది. దీంతో వాహనచోదకులు ఇబ్బంది పడుతున్నారు. జీ-20 సదస్సు కారణంగా ఈ రోడ్డుకు ఎట్టకేలకు మోక్షం లభించింది. రెండు రోజులుగా బీఆర్‌టీఎస్‌పై హనుమంతవాక, సంజయ్‌గాంధీకాలనీ, పెదగదిలి, చినగదిలి వరకు తారు రోడ్డు నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి.

శిథిల కాలువలతో సమస్యలు



దుర్వాసన వెదజల్లుతున్న కాలువలోని మురుగునీరు

పరవాడ: వాడచీపురుపల్లి శివారు పందివానిపాలెం గ్రామంలో మురుగు కాలువల దుస్థితి అధ్వానంగా మారడంతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. వినాయక ఆలయం పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన మురుగు కాలువలు శిథిలావస్థకు చేరుకోవడంతో మురుగునీరు ఎక్కడికక్కడ నిలిచిపోయి దోమలు స్వైరవిహారం చేస్తున్నాయని చెబుతున్నారు. దోమల బెడద వల్ల కంటి మీద కునుకు లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలువల్లోని మురుగునీటి వల్ల దుర్వాసన వస్తోందని.. అనారోగ్యం బారిన పడుతున్నామని వాపోతున్నారు. కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయడానికి పంచాయతీ అధికారులు కనీస చర్యలు చేపట్టడడం లేదని తెలిపారు. ఇప్పటికైనా కాలువలకు మరమ్మతులు చేపట్టి శుభ్రం చేయాలని స్థానికులు కోరుతున్నారు.



శిథిలావస్థకు చేరిన కాలువ

డిగ్రీ కళాశాల బోటనీ లెక్చరర్‌కు డాక్టరేట్



స్వామినాయుడుకు ఉత్తర్వులు అందిస్తున్న ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి

సబ్బవరం: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బోటనీ లెక్చరర్‌గా పని చేస్తున్న డాక్టర్ పి. స్వామినాయుడుకు ఏయూ డాక్టరేట్ లభించింది. వృక్షశాస్త్ర విభాగం సహాయ ఆచార్యుడు పి. బలరామస్వామి ఆధ్వర్యంలో 'ఎథ్నో బొటానికల్ స్టడీస్ ఇన్ ది షెడ్యూల్డ్ మండల్స్ ఆఫ్ విశాఖ డిస్ట్రిక్ట్స్' అంశంపై చేసిన పరిశోధనలకు డాక్టరేట్ ప్రకటించారు. ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి చేతుల మీదుగా ఆయన ఉత్తర్వులు అందుకున్నారు. ఈ సందర్భంగా స్వామినాయుడును ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సీతాలక్ష్మి, కళాశాల అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది ఘనంగా సత్కరించారు.

త్వరలో మిస్ అండ్ మిసెస్ ఉత్తరాంధ్ర పోటీలు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు డాక్టర్ మంచ నాగమల్లేశ్వరి

సీతంపేట: రైతులు, చేనేత కళాకారులకు చేయూత నివ్వాలన్న సంకల్పంతో న్యూ హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మిస్ అండ్ మిసెస్ ఉత్తరాంధ్ర-2023 పోటీలు నిర్వహిస్తున్నట్టు ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు డాక్టర్ మంచ నాగమల్లేశ్వరి తెలిపారు. దీనికి సంబంధించిన పోస్టర్లు శుక్రవారం పౌరగ్రంథాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోటీల్లో పాల్గొనేవారు ఏప్రిల్ 10వతేదీ లోగా 73370 97256, 73964 44404 ఫోన్ల నంబర్లకు సంప్రదించి నమోదు చేసుకోవాలని సూచించారు. కన్స్యూమర్ రైట్స్ కమిషన్ నేషనల్ చైర్మన్ డాక్టర్ సాయి రమేష్, రాష్ట్ర అదనపు కార్యదర్శి సురేష్‌నాయుడు, 2022 మిసెస్ ఉత్తరాంధ్ర విన్నర్ కొణతాల భాగ్య, మిస్ విశాఖ విన్నర్ గౌతమి, ఫౌండేషన్ డైరెక్టర్ సిద్ధు పాల్గొన్నారు.

సాఫ్ట్‌వేర్ కంపెనీ స్థాపనే లక్ష్యం

- కార్పెంటర్ కుమారుడికి గేట్‌లో 13వ ర్యాంక్
- పేదరికాన్ని జయించి లక్ష్యాన్ని సాధించిన సాయి
- ఐఐఎస్సీ బెంగళూరులో చేరేందుకు ఆసక్తి



పండూరి సాయి



తల్లి సరోజినితో సాయి

సబ్బవరం: ప్రతిభకు పేదరికం అడ్డు కాదని మరోసారి నిరూపించాడు పండూరి సాయి. ఆర్థిక ఇబ్బందులను అధిగమించి, గేట్‌లో 924 మార్కులతో ఆలిండియా 13వ ర్యాంక్ సాధించాడు. ఐఐఎస్సీ బెంగళూరులో పీజీ చేసి, సాఫ్ట్‌వేర్ కంపెనీ స్థాపించడం లక్ష్యమని తెలిపాడు. ఇంటర్ పరీక్షకు ఫీజు కూడా కట్టలేని పరిస్థితుల నుంచి గేట్‌లో ర్యాంక్ సాధించేందుకు అతను పడిన తపన, చేసిన శ్రమ నేటి యువతకు స్ఫూర్తిదాయకం. సాయి విజయగాథ అతని మాటల్లోనే..

ప్రాథమిక విద్య ప్రభుత్వ పాఠశాలలోనే..

మాది ఆరిపాక శివారు పెదయాతపాలెం. మా నాన్న పండూరి వెంకటరావు వడ్రంగి. అమ్మ సరోజిని, గృహిణి. మేము ముగ్గురం సంతానం. నాకు ఒక అక్క, చెల్లి ఉన్నారు. 1 నుంచి 5వ తరగతి వరకు మా స్వగ్రామం పెదయాతపాలెంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్నా. తర్వాత పదో తరగతి వరకు విశాఖలోని బంధువుల ఇంటి వద్ద ఉంటూ ప్రైవేట్ పాఠశాలలో చదివాను.

ఆర్థిక ఇబ్బందులతో ఇంటర్‌లో చేరలేక..

టెన్త్ తర్వాత ఇంటర్ చదివేందుకు ఆర్థిక ఇబ్బంది కలిగింది. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఎలక్ట్రికల్‌లో డిప్లమో పూర్తి చేశాను. తర్వాత ఈ సెట్‌లో 8వ ర్యాంక్ సాధించి, ఆంధ్ర యూనివర్సిటీలో ఇంజినీరింగ్ పూర్తి చేశాను. పోటీ పరీక్షల ద్వారా ఉద్యోగం సాధించి, ప్రస్తుతం ఒడిశాలోని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్‌లో గ్రేడ్ 1 ఆఫీసర్‌గా పని చేస్తున్నాను.

టాప్ ఇన్‌స్టిట్యూట్‌లో చదవాలని..

దేశంలోని టాప్ ఇన్‌స్టిట్యూట్‌లో చదవాలని లక్ష్యంగా పెట్టుకుని గేట్‌కు ప్రిపేర్ అయ్యాను. రోజుకు 14గంటలు ప్రిపేర్ అయ్యేవాడిని. అనుకున్నట్టుగానే మంచి ర్యాంక్ వచ్చింది. ఈ ర్యాంక్‌కు డీఆర్‌డీఏ, బార్క్, ఇస్రో వంటి సంస్థల్లో చేరవచ్చు. కానీ ఐఐఎస్సీ బెంగళూర్‌లో ప్రవేశం పొందడం ద్వారా నా కలను సాకారం చేసుకోవాలనుకుంటున్నా. ఎంటెక్‌లో వీఎల్ఎస్ఐ స్పెషలైజేషన్ చేసి, మంచి సాఫ్ట్‌వేర్ కంపెనీ ప్రారంభించడమే లక్ష్యం.

అమ్మ,నాన్నల కష్టాలను తీర్చాలి

అమ్మ, నాన్న పడిన ఇబ్బందులు చూస్తూ పెరిగాను. ఒక రకంగా మా ఆర్థిక ఇబ్బందులే నా పట్టుదలను పెంచాయి. ఎంత కష్టమైనా ఇష్టంతో చదివాను. ర్యాంక్ రాగానే అమ్మ, నాన్నలతో ఆ ఆనందాన్ని పంచుకున్నా. వారికి ఏ కష్టం లేకుండా చూసుకోవాలని కోరిక.

ప్రైవేటీకరణతో కార్మికులకు అన్యాయం



దీక్ష శిబిరంలో కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఆదినారాయణ

కూర్మన్నపాలెం: కార్మికుల జీవితాలను నాశనం చేసే ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ నిర్ణయాలను కేంద్ర ప్రభుత్వం విరమించుకోవాలని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు పిలుపునిచ్చారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన ఉక్కు రిలే నిరాహార దీక్షలు శుక్రవారం నాటికి 764వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో ఎస్ఎంఎస్-1 విభాగ కార్మికులు పాల్గొన్నారు. నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం దేశ సంపదను పేదల కడుపు కొట్టి మరీ బడా బాబులకు ధారపోస్తోందని విమర్శించారు. కోవిడ్ సమయంలో పేదలు ఎన్నో ఇబ్బందులు పడితే, అదే సమయంలో కార్పొరేట్ శక్తులు తమ సంపదను మరింత పెంచుకున్నాయన్నారు. నేటి ప్రభుత్వాలు సంపదను సృష్టించకుండా ప్రైవేటీకరణ పేరుతో సర్వనాశనం చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా కేంద్రప్రభుత్వ పెద్దలు విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని విరమించుకోవాలని కోరారు.

సింహాద్రి ఎన్టీపీసీ కృషి ప్రశంసనీయం



తాబేలు పిల్లలను సముద్ర జలాల్లో వదులుతున్న అటవీశాఖ అధికారులు

పరవాడ: ఆలివ్‌రిడ్లే తాబేళ్ల రక్షణకు సింహాద్రి ఎన్టీపీసీ యాజమాన్యం చేస్తున్న కృషి ప్రశంసనీయమని అనకాపల్లి అటవీశాఖ రేంజ్ ఇన్‌చార్జి పీవీ రవివర్మ అన్నారు. సింహాద్రి ఎన్టీపీసీ ఆర్థిక సహకారంతో ముత్యాలమ్మపాలెం తీరంలో పెంపకం కేంద్రంలో పొదిగించిన 150 ఆలివ్ రిడ్లీ తాబేలు పిల్లలను శుక్రవారం ఆయన సముద్ర తీరంలో విడిచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలీవ్‌రిడ్లే తాబేళ్ల సంరక్షణకు ముత్యాలమ్మపాలెం తీరంలో ప్రత్యేకంగా హేచరీ ఏర్పాటు చేశామన్నారు. సిబ్బంది ద్వారా తీరంలో 9570 తాబేళ్ల గుడ్లు సేకరించామన్నారు. వాటిని హేచరీలో 40-50 రోజుల పాటు పొదిగించి పిల్లలుగా మారిన తర్వాత సముద్రంలో విడిచిపెడతామని అన్నారు. హేచరీ సిబ్బంది వేతనాల మంజూరుకు జిల్లా అటవీశాఖ ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించామని త్వరలో సమస్య పరిష్కారం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి అటవీశాఖ అధికారులు పి.జ్యోతిర్మయి, ఫారెస్టు సెక్షన్ అధికారి కె.కాశీప్రసాద్, ఈ.శివప్రసాద్ పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఉచిత శిక్షణ, ఉపాధి అవకాశం

దొండపర్తి(విశాఖ దక్షిణ): టెక్ మహీంద్రా ఫౌండేషన్ వారి సహకారంతో నిర్మాణ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతీ, యువకులకు ఉపాధి అవకాశాలు ఉన్న కోర్సుల్లో ఉచిత శిక్షణ అందించి ఉపాధి కల్పించనున్నట్లు నిర్మాణ్ సంస్థ డైరెక్టర్ మయూర్ పట్నాల తెలిపారు. ఇంటర్ పాస్, డిగ్రీ పూర్తయిన 18 నుంచి 28 ఏళ్లలోపు ఉన్న వారి అర్హులన్నారు. టైపింగ్ స్కిల్స్, ఎంఎస్ ఆఫీస్, ఇంటర్నెట్ కాన్సెప్ట్స్, కమ్యూనికేటివ్ ఇంగ్లీష్, హెచ్‌టీఎంఎల్, సీఎస్ఎస్, ఆఫీస్ అడ్మినిస్ట్రేషన్, టెక్నికల్ స్కిల్స్, బేసిక్ అకౌంటింగ్ స్కిల్స్ కోర్సులో 3 నెలల పాటు ఉచిత శిక్షణ ఉంటుందని వెల్లడించారు. శిక్షణ అనంతరం ఉపాధి అవకాశాలు కూడా కల్పిస్తామన్నారు. అర్హత గల అభ్యర్థులు ఎన్ఏడీ కొత్త రోడ్డు ప్రాంతంలో బాజీ జంక్షన్‌లో గల నిర్మాణ్ ఆర్గనైజేషన్ కేంద్రంలో కానీ 9502874304, 9908104113 ఫోన్ నెంబర్లకు ఈ నెల 18వ తేదీలోగా సంప్రదించాలని సూచించారు.

వారపు సంత, డైలీ మార్కెట్‌కు వేలం పాట



వేలం పాట నిర్వహిస్తున్న ఈవోపీఆర్‌డీ మహేష్ తదితరులు

సబ్బవరం: మేజర్ పంచాయతీ పరిధిలో ప్రతి ఆదివారం నిర్వహించే సంతపాటతో పాటు రైతులు పండించే కూరగాయలకు సంబంధించి డైలీ మార్కెట్ వేలం పాట శుక్రవారం నిర్వహించారు. మండల పంచాయతీరాజ్ విస్తరణాధికారి మహేష్ ఆధ్వర్యంలో సర్పంచ్, పాలకవర్గ సభ్యుల సమక్షంలో నిర్వహించిన వేలం పాటలో అధిక సంఖ్యలో వ్యాపారులు పాల్గొన్నారు. ఆదివారం సంత పాటను స్వయంవరపు బుజ్జి అనే వ్యక్తి రూ. 2 లక్షల వెయ్యికి దక్కించుకున్నారు. అదే విధంగా డైలీ మార్కెట్ పాటను గొర్లివానిపాలేనికి చెందిన జి. నాయుడుబాబు రూ. 3,21,000లకు పాడుకున్నారు. ఈ పాటలో సుమారు 61 మంది వ్యాపారులు పాల్గొన్నారు. గత సంవత్సరం కరోనా కారణంగా డైలీ మార్కెట్, ఆదివారం సంత వేలం పాటలు సజావుగా సాగలేదని సర్పంచ్ దెద్దం ప్రసాదరావు తెలిపారు. సర్పంచ్‌తో పాటు ఉప సర్పంచ్ మండల లక్ష్మణ, పంచాయతీ కార్యదర్శి మూర్తిబాబు, వార్డు సభ్యులు సబ్బవరపు శివ, పోతల కనకరాజు, బి. లక్ష్మణ, ఎన్. కోటి, చిత్రాడ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌లో 'స్వచ్ఛత పక్వాడా'



స్వచ్ఛత ప్రతిజ్ఞ చేస్తున్న ఉన్నతాధికారులు, ఉద్యోగులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో శుక్రవారం నిర్వహించిన స్వచ్ఛత పక్వాడా కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది. ఈడీ (వర్క్స్) బిల్డింగ్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీజీఎం (వర్క్స్) ఇన్‌చార్జ్ డి.కె. మొహంతి, సీజీఎం (మెయింటెనెన్స్) సారంగి, మిల్స్ సీజీఎం యు. శ్రీధర్, సీజీఎం (సర్వీసెస్) ఎం.ఎస్.వి.కృష్ణయ్య, సీజీఎం (మైన్స్) సోబ్తీ తదితరుల ఆధ్వర్యంలో బిల్డింగ్ పరిసరాలను శుభ్రం చేశారు. అక్కడ పేరుకుపోయిన చెత్తను తొలగించారు. ఈ సందర్భంగా నిర్వహించిన స్వచ్ఛత పక్వాడా ప్రతిజ్ఞలో జీఎం (పీఎం) డాక్టర్ రమాదేవి, జీఎం (ఐఆర్) కె. సంజీవరావు, వర్క్స్ అడ్మిన్ అధికారి గోపినాథ్‌తో పాటు బిల్డింగ్‌లోని పలు విభాగాలకు చెందిన ఉద్యోగులు పాల్గొన్నారు.

భద్రతా విభాగం ఆధ్వర్యంలో ..

ఉక్కు భద్రతా విభాగం ఆధ్వర్యంలో సింటర్ ప్లాంట్ రహదారిలో స్వచ్ఛతా పక్వాడా నిర్వహించారు. ఈ నెల 28న జరగనున్న స్టీల్ సేఫ్టీ డే సందర్భంగా ఉదయం విభాగం అధికారులు, సెంట్రల్ సేఫ్టీ కమిటీ సభ్యులు రహదారిలోని దుమ్ము, ఇసుక, స్లాగ్ లాంటి మెటీరియల్‌ను శుభ్రం చేశారు. కార్యక్రమంలో విభాగం జీఎం జె. రాజేంద్రన్, జోనల్ సేఫ్టీ ఆఫీసర్లు బయ్యే మల్లయ్య, మోహన్, సురేష్‌కుమా ర్, కృష్ణమూర్తి, అభిజిత్ తదితరులు పాల్గొన్నారు.

ఈ-వాహన రంగంలో అవకాశాలు అపారం



మాట్లాడుతున్న ప్రొఫెసర్ అరుణ్‌కుమార్

అగనంపూడి: ఈ వాహన రంగంలో అపారమైన అవకాశాలు ఉన్నాయని ఐఐటీ జమ్ము ప్రొఫెసర్ అరుణ్‌కుమార్ వర్మ అన్నారు. దానిపై విద్యార్థులు దృష్టి సారించాలని సూచించారు. ఎలక్ట్రానిక్ వాహనాలు, అవకాశాలు, అవరోధాలు అనే అంశంపై దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. ఈ రంగంలో అనేక దిగ్గజ బహుళ జాతి కంపెనీలు దృష్టి సారించాయని, రానున్నది ఈ వాహనాల యుగమని అన్నారు. అందుకే విద్యార్థులు ఆ దిశలో పరిశోధనలు చేయడం మంచిదన్నారు. ఈ రంగంలో వస్తున్న సవాళ్లు, వాటిని అధిగమించడానికి గల అవకాశాలను వివరించారు. కార్యక్రమంలో విజ్ఞాన్ రెక్టార్ వి.మధుసూదనరావు, ప్రిన్సిపాల్ బి.అరుంధతి, వైస్ ప్రిన్సిపాల్ కె.మధుసూదనరావు, కో-ఆర్డినేటర్లు సుశాంత్‌కుమార్ సాహు, సీహెచ్.వి.రమణ, వివిధ విభాగాల డీన్లు పాల్గొన్నారు.

'భిన్న వాతావరణాలను తట్టుకునేలా నిర్మాణాలు'



సదస్సును ప్రారంభిస్తున్న ఆచార్య సత్యనారాయణరెడ్డి

ఏయూ క్యాంపస్: సముద్రతీర ప్రాంతాలలో వైవిధ్యమైన వాతావరణ పరిస్థితులు ఉంటాయని, వీటిని తట్టుకుని నిలిచే విధంగా నిర్మాణాలు చేపట్టాలని ఏయూ సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి ఆచార్య సి.ఎన్.వి సత్యనారాయణ సూచించారు. ఏయూ సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో 'రీసెంట్ అడ్వాన్సెస్ ఇన్ సివిల్ ఇంజినీరింగ్' అంశంపై శుక్రవారం జరిగిన ఒక రోజు సదస్సును ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ కొండవాలు ప్రాంతాలలో జరిగే నిర్మాణాలో తీసుకోవలసిన జాగ్రత్తలు ఎంతో కీలకమన్నారు. సాగర్ సిమెంట్స్ సీనియర్ మేనేజర్(టెక్నికల్ సర్వీసెస్) జనార్దన్ అరుణాచలం మాట్లాడుతూ విభిన్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా సిమెంట్ నిర్మాణాలు, తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించారు. ఐఐటీ మద్రాస్ సివిల్ ఇంజినీరింగ్ పూర్వ ఆచార్యుడు కె.రాజ గోపాల్ మాట్లాడుతూ జియో సింథసిటిక్ మెటీరియల్‌తో నిర్మించిన కన్నూర్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణ వివరాలను తెలియజేశారు. ఈ సదస్సులో గర్‌వారి వాల్ ఫైబర్ లిమిటెడ్(పూణే) ప్రతినిధి రమేష్ చెట్టి, కెల్లెర్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ వై.హరికృష్ణ, విభాగ ఆచార్యులు డాక్టర్ ఐ.శివపార్వతి పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌గా శశిభూషణరావు



వీసీ ప్రసాదరెడ్డి నుంచి ఉత్తర్వులు స్వీకరిస్తున్న ఆచార్య శశిభూషణరావు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఆచార్య జి.శశిభూషణరావు నియమితులయ్యారు. ఈ మేరకు ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి నుంచి ఆయన శుక్రవారం నియామక ఉత్తర్వులు స్వీకరించారు. అనంతరం ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టారు. ఆచార్య శశిభూషణరావును ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య ఎ.కిషోర్‌బాబు, పలువురు ఆచార్యులు అభినందించారు.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేకం



క్షీరాభిషేక సేవలో సిరులతల్లి

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఈవో శిరీష తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులను లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. పై పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891-2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు. ఈవో శిరీషతో పాటు ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో వెంపలి రాంబాబు పాల్గొన్నారు.

'పోర్ట్ హాస్పిటల్ ప్రైవేటీకరణ తగదు'

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం పోర్ట్ ట్రస్ట్‌లో విధులు నిర్వర్తించే ఎంతో మందికి వైద్య సేవలందించిన, ప్రస్తుతం అందిస్తున్న పోర్ట్ గోల్డెన్ జూబ్లీ హాస్పిటల్‌ను ప్రైవేటుకు అప్పగించే ఆలోచనను విరమించాలని పోర్ట్ పెన్షనర్లు కోరారు. ఈ మేరకు శుక్రవారం కైలాసపురం దరి శాంతిపురంలో సమావేశం నిర్వహించారు. ఇటీవల జరిగిన రిటైర్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్(పోర్ట్ పెన్షనర్స్) సమావేశంలో ఈ మేరకు తీర్మానించామని, దీనిపై కోర్టు ఇచ్చిన స్టేను అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎ.ఎం.ఫ్రెడ్డీ, సెక్రటరీ ఎం.ఎస్.ఆర్.గుప్తా, కోశాధికారి డి.వెంకటేశ్వరరావు, ఇతర సభ్యులు పాల్గొన్నారు.